సేద్యపు ఖర్చులు తగ్గకుండా – పంటలకు న్యాయమైన ధరలు లభించకుండా రైతుల నిజ ఆదాయం పెరగదు

వచ్చే ఐదేళ్ళ (2022) కాలంలో రైతుల 'ఆదాయాలు' రెట్టింపు చేస్తామన్న దానితో ఆర్థికమంత్రి ప్రారంభించిన బడ్జెట్ ప్రసంగం ఎండమావుల ఆశలను రైతులకు కల్పించడమే. వ్యవసాయరంగానికి కేటాయింపులు, నీటిపారుదల సౌకర్యం, నిల్వ, ప్రాసెసింగ్ సౌకర్యాలు, ఏకీకృత మార్కెట్ వ్యవస్థ వంటి మౌలిక వసతులు కల్పించటం ద్వారా రైతుల ఆదాయం పెంచవచ్చన్న ఆలోచన బడ్జెట్‌లో ప్రధానాంశంగా వ్యక్తపర్చారు.

పెరుగుతున్న సాగుఖర్చులు, పెరగని పంటల ధరలు, పెరుగుతున్న జీవన వ్యయం, పెరగని మద్దతు ధరల వలన రైతాంగం ఆదాయం నిరంతరం తగ్గిపోతూ వస్తున్నది. వీటిని గురించి బడ్జెట్‌లో పేర్కొనలేదు. నేషనల్ శాంపిల్ సర్వే 70 రౌండ్ (2014) రైతుల సగటు నెలసరి ఆదాయం 6,426 రూపాయలకన్నా తక్కువ ఉందని పేర్కొంది. బడ్జెట్‌కి రెండు రోజుల ముందు ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 17 రాష్ట్రాల్లో సగటు కుటుంబ నెలసరి ఆదాయం 1666 రూపాయలుగా పేర్కొంది. రైతు సగటు నెలసరి ఆదాయం 6,426రూ॥ కూడా సర్కారు బంట్రోతు ఉద్యోగికి వచ్చే వేతనం కన్నా రెండు రెట్లు తక్కువ.

ఐదు సంవత్సరాల్లో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకు చేపట్టే విధానాలు స్పష్టపర్చలేదు. ఆదాయం పెంచటానికి బడ్జెట్ సందర్భముగా చెప్పిన అంశాలు వారి ఆదాయాన్ని రెట్టింపు చేయకపోగా తగ్గించే ప్రమాదం ఉంది. వాటిని పరిశీలిస్తే ప్రభుత్వ బూటకత్వం అర్థమౌతుంది.

ప్రస్తుతం కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి 35,984 కోట్లకు పెంచినట్లు ప్రభుత్వం చెబుతున్నది. 2014–15 సం॥లో బడ్జెట్ కేటాయింపు 31 వేల కోట్లు ఉండగా, 2015–16 సం॥ బడ్జెట్‌లో 24,910 కోట్లకు తగ్గించారు. ఇప్పుడు 35,984 కోట్లకు పెరగటం దాన్ని ఎక్కువగా చూపించటం అంకెల, మాటల గారడీ చేయటమే 68 శాతం ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి ఉంటే, మొత్తం బడ్జెట్‌లో 1.9 శాతం మాత్రమే వ్యవసాయరంగానికి కేటాయించటం రైతుల ఆదాయాన్ని ఎలా పెంచుతుంది?

సేద్యానికి సాగునీరు చాలా కీలకం. సాగునీరు అందించటాన్ని కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశ్య పూర్వకంగానే విస్మరించాయి. వర్షం, వరదల నీరు నిల్వచేయటానికి అవసరమైన రిజర్వాయర్లు, చెరువులు, ప్రాజెక్టులు నిర్మించటంలో ప్రభుత్వాలు విఫలమైనాయి. ఫలితంగా దేశంలోని అనేక ప్రాంతాలు కరువుపీడిత ప్రాంతాలుగా నేటికీ కొనసాగుతున్నాయి. రాష్ట్రాల మధ్య నీటి వివాదాలను కేంద్ర పాలకులే సృష్టించి, ప్రాజెక్టులు పనులు ముందుకు సాగకుండా చేస్తున్నారు. ఎన్.డి.ఏ ప్రభుత్వం, ప్రధానమంత్రి కృషి యోజన (పీఎంకెవై) ద్వారా అదనంగా 28.5 లక్షల హెక్టార్ల భూమిని నీటి పారుదల సౌకర్యం క్రిందకు తీసుకొస్తామని చెప్పి అందుకోసం 12,000 కోట్లు కేటాయించటం గొప్పగా చెప్పుకొంటున్నది. 2014–15 సం॥లో ఈ పథకం క్రింద 13,492 కోట్లు కేటాయించి కేవలం 5630 కోట్లు ఖర్చుచేయటం సాగునీరు అందించటంలో ఎన్.డి.ఏ ప్రభుత్వం చిత్తశుద్ధి ఏపాటిదో వెల్లడైంది. ఈ సంవత్సరం కేటాయించిన మొత్తంలో గత సంవత్సరం మిగులు తీసివేస్తే కేటాయింపు తక్కువ అన్నది ఎవరికైనా అర్థమౌతుంది. ప్రస్తుత కేటాయింపులు మొత్తం ఖర్చుచేస్తారన్న నమ్మకంలేదు. అదనపు భూమికి సాగునీరు అందుతుందన్న నమ్మకం లేదు. సేద్యం నీరు లేకుండా రైతుల ఆదాయం ఎలా పెరుగుతుంది?

రుణ పరపతి రైతాంగం సేద్యానికి ఎంతో అవసరం. ప్రస్తుత బడ్జెట్ సందర్భముగా బ్యాంక్‌ల ద్వారా 9 లక్షల కోట్ల రుణాలను రైతులకు అందించే విధంగా లక్ష్యం పెట్టుకొన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందుకు వడ్డీ రాయితీ కోసం 15 వేల కోట్లు కేటాయించినట్లు బడ్జెట్‌లో లెక్క చూపెట్టారు.

బ్యాంక్‌లు జాతీయకరణ జరిగి 45 సంవత్సరాలు గడుస్తున్నా అత్యధికశాతం రైతులకు సంస్థాగత రుణాలు బ్యాంక్‌ల నుండి అందక అధిక వడ్డీకి ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. బ్యాంకులు యిచ్చే రుణాల్లో 18 శాతం రుణాలను ప్రాధాన్యతా రంగంగా గుర్తించి వ్యవసాయ రంగానికి ఇవ్వాలి. అందులో 10.5 శాతం మాత్రమే ఆ రంగానికి అందుతున్నాయి. ఇందులోనూ గ్రామాల్లోని రైతులకు అందే రుణాలు 4.5 శాతం కాగా, సెమి అర్బన్, అర్బన్, మెట్రో ప్రాంతంలో వ్యవసాయం పేరుమీద స్పిన్నింగ్ మిల్లులు, నూనె మిల్లులు, పప్పు మిల్లులు, చక్కెర మిల్లులు, అగ్రి ప్రాసెసింగ్ పరిశ్రమలకు 6 శాతం రుణాలు ఇస్తున్నారు. ఈ రుణాలను కూడా వ్యవసాయ రుణాల జాబితాలో చేర్చటం పాలకుల మోసకారితనానికి నిదర్శనం. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులో కూడా ఇదేవిధంగా రుణ పంపిణీ జరుగుతుంది.

చిన్న, సన్నకారు రైతులకు వడ్డీ లేకుండాను, పావలా వడ్డీతో యిచ్చే రుణాలకు బ్యాంకులకు రాయితీ చెల్లించేందుకు 15 కోట్ల బడ్జెట్ కేటాయింపుల వలన, కొద్దిమంది రైతులకు మాత్రమే దానికింద అందే అవకాశం ఉంది. దేశ సంపదలను దోచుకోవటానికి

వచ్చిన వలస పాలకులు కూడా, రైతులకు యిచ్చే రుణాల మీద 4 శాతంకి మించి వడ్డీ వసూలు చేయరాదని, చక్రవడ్డీ కాకుండా, బారువడ్డీ వసూలు చేయాలని, వడ్డీ అసలుకు మించరాదని, రైతుల ఆస్తులు జప్తు చేయరాదని బ్యాంక్‌లను ఆదేశించారు. వలస పాలకుల నుండి అధికారాన్ని బదలాయించుకొన్న దేశ దళారీ పాలకులు రుణాల విషయంలో ఆ విధానాలను సైతం పక్కనబెట్టి బ్యాంక్‌ల దోపిడీకి రైతులను గురిచేస్తున్నారు.

రాష్ట్రంలో 16.5 లక్షలమంది కౌలు రైతులు ఉన్నారు. 40 శాతం కమతాలను సాగుచేసేది కౌలుదారులే. కౌలురైతుల్లో సగటున 23 వేల పంట రుణాలు పొందినవారు 95 వేలు మించి లేరు. కౌలు రైతులకు కూడా షరతులు లేకుండా పంట రుణాలు ఇవ్వాలి. ఈ విధానాన్ని పాలకులు అమలు జరపక పోవటం వలన సంస్థాగత రుణాలకు కౌలురైతులు దూరమౌతున్నారు.

రైతులందరికీ పావలా వడ్డీకి సంస్థాగత రుణాలు అవసరం మేరకు అందించకుండా, వడ్డీ వ్యాపారుల దోపిడీకి వారిని గురిచేస్తున్న పాలకులు రైతుల ఆదాయాన్ని ఎలా రెట్టింపు చేయగలుగుతారు?

రైతాంగానికి ఆదాయం పెరగటానికి పంటలకు న్యాయమైన ధరలు లభించటం ద్వారానే సాధ్యమౌతుంది. దీన్ని బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించకపోవటం రైతులకు రెట్టింపు ఆదాయం వచ్చేలా చూస్తామని ఎన్.డి.ఏ ప్రభుత్వం చెప్పటంలోని బూటకత్వం అర్ధమౌతుంది. న్యాయమైన ధరలు కల్పించటానికి ప్రభుత్వం సుముఖంగా లేదు. పంట ఖర్చులపైన 50 శాతం అదనంగా మద్దతు ధర నిర్ణయించాలని స్వామినాధన్ చెప్పినదాన్ని ఎందుకు అమలుపర్చటంలేదని సుప్రీంకోర్టు అడగగా అలా పెంచటం సాధ్యంకాదని ప్రభుత్వం చెప్పటమే అందుకు నిదర్శనం.

సేద్యానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారకాల ధరలు, డీజిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. 2009 సం॥ నుండి ఎరువుల ధరల నిర్ణయాధికారాన్ని కేంద్ర ప్రభుత్వం వదులుకొని ఎరువుల కంపెనీలకు ఇవ్వటంతో అప్పటినుండి ఎరువుల ధరను ఇష్టమొచ్చినట్లు కంపెనీలు పెంచుతూ వస్తున్నాయి. 2010 నుండి 14 సం॥ వరకు ఎరువుల ధరల పెరుగుదల ఈ విధంగా ఉంది. డి.ఏ.పి 486 నుండి 1248, 28-28-0 389 నుండి 1398, 20-20-0 327 నుండి 950, 14-35-14 425 నుండి 1207 రూపాయలకు పెరిగాయి. గత సంవత్సరం కూడా వీటి ధరలను ఎరువుల కంపెనీలు పెంచాయి.

విత్తనాల ధరలను కూడా ప్రభుత్వం పెంచింది. 2011 సం॥లో వేరుశనగ విత్తనాలు క్వింటాల్ ధర 3900 రూ॥ ఉండగా 2014 నాటికి 4500 రూ॥లకు, గత సంవత్సరం 5 వేలకు పైగా ధర పెరిగింది. బి.టి.పి వరి విత్తనం 1950 నుండి 2200 రూ॥ ఎం.టి.యు 1010, 1001 వరి విత్తనాలు 1850 నుండి 2100 రూ॥ ధరలు పెరిగాయి. మొక్కజొన్న, జొన్న, ఆముదం మొదలైన విత్తనాల ధరలు కూడా పెరిగాయి. మోటారు సేద్యపు రైతులకు డీజిల్ ధరలు పెరిగాయి.

విదేశీ విత్తనాల వలన చీడపీడలు పెరిగి పురుగు మందులు వాడందే పంట చేతికి రాని పరిస్థితి రైతాంగానికి ఏర్పడింది. 2008-09 సం॥లో పురుగు మందుల వాడకం ఆంధ్రప్రదేశ్‌లోనే 8,374 టన్నులు ఉండగా 2014-15 నాటికి 11 వేల టన్నులకు చేరుకొంది. రాష్ట్ర రైతాంగం, పురుగుమందుల కోసం ఎకరానికి పెట్టే ఖర్చు 2800 నుండి 4000 చేరుకొంది. 2011 నుండి 2015 సం॥ వరకు వీటి ధరలు 15 నుండి 22 శాతం పెరిగాయి.

ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలు, డీజిల్ ధరలు పెరుగుతూ ఉండటంతో సేద్యపు ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. 1952 సం॥లో ఎకరం వరి సేద్యానికి 156 రూ॥ ఖర్చుకాగా నేడు 25 వేలకు చేరింది. కౌలుదారులు అదనంగా 10 నుండి 25 వేల వరకు ఖర్చుపెట్టాల్సి వస్తున్నది. పత్తి సేద్యానికి 1963-70 సం॥ మధ్యలో 3,500 రూ॥ కాగా నేడు 32 వేలకు పెరిగింది. చెరకు పంటకు 62 వేలకు పైగా ఖర్చు అవుతున్నది. మొక్కజొన్నకి 2000 సం॥లో 10 వేలు ఖర్చు చేయగా నేడు 20 వేలు ఖర్చు చేస్తున్నారు. వేరుశనగకి 2010 సం॥లో 11,269 ఖర్చుకాగా నేడు 18 వేలకు చేరుకొంది. ఇవేకాక ఇతర పంటల ఖర్చులు కూడా పెరిగాయి.

నిరంతరం సేద్యపు ఖర్చులు పెరుగుతున్నా అందుకు అనుగుణంగా రైతాంగం పండించే పంటలకు మాత్రం న్యాయమైన ధరలు లభించటంలేదు. పెరుగుతున్న సేద్యపు ఖర్చులు, రైతు కుటుంబ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పంటలకు మద్దతు ధరలను ప్రభుత్వం ప్రకటించటంలేదు. రైతుల ప్రయోజనాలకు ఏవిధంగానూ మద్దతుధరలు దోహద పడటం లేదు. మద్దతుధరల నిర్ణయంపై వ్యవసాయశాఖ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఇష్టమొచ్చినట్లు ధరలను ప్రకటిస్తున్నది.

వరి ధాన్యం క్వింటాల్ ఉత్పత్తికి 1950 రూ॥ ఖర్చు అవుతుందని చెప్పగా, 2015-16 సం॥ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మేలురకంకి 1450, సాధారణ రకంకి 1410 రూ॥ మాత్రమే. చెరకు టన్ను ఉత్పత్తి ఖర్చు 2600 రూ॥గా ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ చెప్పగా కేంద్రం ప్రకటించిన మద్దతు ధర 2150 రూ॥ పత్తి క్వింటాల్ ఉత్పత్తికి 6,836రూ॥ ఖర్చు అంచనా కాగా 4100గా మద్దతుధర ప్రకటించింది. ఇదేవిధంగా వ్యవసాయశాఖ సూచించినవిధంగా ఇతర పంటలకు కూడా మద్దతు ధరలు ప్రకటించలేదు. సేద్యపుఖర్చులు పెరిగి, న్యాయమైన ధరలు పంటలకు లభించకపోవటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు.

సేద్యపు ఖర్చులను తగ్గించి, పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించకుండా రైతుల ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎలా రెట్టింపుకి పెంచగలుగుతుంది?

అమెరికా, తూర్పు యూనియన్ దేశాలు రైతులకు పెద్దఎత్తున సబ్సిడీలు యిస్తుంటే, భారతదేశంలో రైతాంగానికి ఇస్తున్న నామమాత్రపు సబ్సిడీలను పాలకులు తగ్గించివేస్తున్నారు. ప్రపంచ వ్యవసాయ ఒడంబడిక ప్రకారం అన్నిదేశాలు సబ్సిడీలు తగ్గించాల్సి ఉంది. అమెరికా, యూరప్ యూనియన్ దేశాలు అందుకు భిన్నంగా గ్రీన్ బాక్స్ పేరుతో ఆ దేశాల రైతులకు అందచేస్తున్న సబ్సిడీలను గమనిస్తే, భారత రైతులకు అందే సబ్సిడీ సముద్రంలో నీటిబొట్టులాంటిది. 1999లో ఆ దేశాల్లో ఒక్కో రైతుకి (భూకామందులు) అందిన సబ్సిడీ ఈ విధంగా ఉంది. కెనడాలో 5,40,000 రూ॥ యూరోపియన్ యూనియన్‌లో 10,29,000 రూ॥, జపాన్ 15,60,000 రూ॥, అమెరికా 12,60,000రూ॥, ఓయిసిడి 6,60,000 రూపాయలు ప్రతి సంవత్సరం సబ్సిడీ పెద్దఎత్తున అక్కడ అందిస్తున్నాయి. భారత రైతులకు అందుతున్న సబ్సిడీ 3960 రూ॥ మాత్రమే. అమెరికాలో వరి, పత్తి ఉత్పత్తి విలువకన్నా ఇస్తున్న సబ్సిడీ ఎక్కువగా ఉంది. గ్రీన్ బాక్స్ ద్వారా భారత రైతులకు ఎంతైనా సబ్సిడీ ఇవ్వడానికి అవకాశం ఉన్నా, ప్రపంచబ్యాంక్ సూచనలమేరకు ఇస్తున్న సబ్సిడీ అనేక రూపాల్లో తగ్గించివేస్తున్నది. బడా పారిశ్రామిక వేత్తలకు ప్రతి సంవత్సరం లక్షల కోట్లు రాయితీ ఇస్తున్న దేశ పాలకులు, రైతులకు యిచ్చే 70 వేల కోట్ల సబ్సిడీని భారంగా భావించటం రైతాంగం ఎడల ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతున్నది.

రైతుల పంటల సేద్యానికి సబ్సిడీ పెంచకుండా రైతులకు రెట్టింపు ఆదాయం ఎలా వస్తుంది? సబ్సిడీలు పెంచేందుకు కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు జరగలేదు.

ప్రధానమంత్రి కొత్త ఫసల బీమా యోజనా పథకం గురించి రైతాంగానికి ఎంతో మేలు చేస్తుందని ఎన్.డి.ఏ. ప్రభుత్వం దేశమంతటా ఊదర కొదుతున్నది. బీమా ప్రీమియంలో రైతులు చెల్లించేది తగ్గించి, తగ్గినదాన్ని ప్రభుత్వమే కడతానంటున్నది. పంటల బీమా పథకం గురించి చాలామంది రైతులకు తెలియక పోవటం, సక్రమంగా బీమా పరిహారం అందకపోవటంతో అత్యధికమంది రైతులు బీమా పథకంలో భాగస్వాములు కాలేరు. కొన్ని పంటలలో బీమా చేసిన రైతులు 6 శాతం కూడా లేరు. ఇలాంటి పరిస్థితిలో ఎక్కువమంది రైతులను చేర్పించి బీమా కంపెనీలకు పెద్దఎత్తున నిధులు సమకూర్చి అవి లాభం పొందేందుకు ప్రీమియం మొత్తంలో కొంత ప్రభుత్వం భరించటానికి సిద్ధమైంది. బీమా ప్రీమియం పంట విలువకు కాకుండా, పంట ఖర్చులకే బీమాను పరిమితం చేయటం రైతులకు నష్టమైంది. పంటనష్టం జరిగినప్పుడు, రైతులకు యిచ్చిన రుణాలకు గ్యారంటీగా పంటల బీమా పథకం దోహదపడుతున్నది. బీమా పరిహారం రైతులకు ఇవ్వకుండా నేరుగా బ్యాంక్‌లకు జమచేయటం అందుకు నిదర్శనం. బడ్జెట్‌లో 4,500 కోట్లు కేటాయించడం బ్యాంక్‌ల, బీమా కంపెనీల ప్రయోజనం కోసమే. రైతులు చెల్లించిన ప్రీమియం కన్నా పంట ఎక్కువ జరిగినప్పుడు కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు ఆ మొత్తాన్ని చెల్లించేందుకు అంగీకరించటం బీమా కంపెనీల ప్రయోజనం కోసం కాదా? అలాంటప్పుడు పంటల బీమా పథకాన్ని నేరుగా ప్రభుత్వమే చేపట్టవచ్చు గదా!

ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ప్రభుత్వం ఎకరాకి 4 వేలకు మించి పరిహారం ఇవ్వటంలేదు. అది కూడా అందరికీ అందటంలేదు. ఈ పరిహారాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నా అందుకు పాలకులు సిద్ధపడటంలేదు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో నష్టపోయిన రైతులకు పూర్తిపంట ఖర్చులు ఇవ్వాలి. అప్పుడే రైతుకు కొంత ఊరట కలుగుతుంది. దీన్ని పాలకులు అమలుచేయకుండా రైతుల ప్రయోజనం ఎలా కాపాడుతారు?

ఇప్పటికే మార్కెట్ కమిటీలను, యార్డులను కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయి. అనేక కమిటీలను ఇతర కమిటీల్లో విలీనం చేశాయి. మార్కెట్ యార్డుల్లో వసతుల లేమిని సృష్టించారు. యార్డులను ప్రైవేటీకరించే విధానాలను చేపడుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం చేపడుతున్న ఏకీకృత మార్కెట్‌వ్యవస్థ అందుకే దోహద పడుతుంది. మార్కెట్ పూర్తిగా ప్రైవేట్‌సంస్థల పరమౌతుంది. కొనుగోళ్ళు, పంటల ధరలను వారే నిర్ణయిస్తారు. వారి దయాదాక్షిణ్యాలపై కొనుగోళ్ళు జరుగుతాయి. రైతులు తీవ్రమైన దోపిడీకి గురౌతారు. ఇలాంటి ఏకీకృత మార్కెట్ వ్యవస్థ రైతుల ఆదాయాన్ని ఎలా పెంచగలుగుతుంది?

పంటలకు న్యాయమైన ధర రాక, సేద్యపు ఖర్చులు పెరిగి అప్పులపాలై వాటిని తీర్చలేని పరిస్థితుల్లో దేశవ్యాపితంగా మూడులక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇలాంటి స్థితిలో ఉన్న రైతాంగాన్ని పాలకులు ఏవిధంగానూ ఆదుకోవటంలేదు. నష్టాల పేరుతో కార్పొరేట్‌సంస్థలు అప్పులు తీర్చలేమని చెప్పగా లక్షలాదికోట్లు ఉద్దీపన ప్యాకేజీ యిచ్చిన పాలకులు, మరణ మృదంగంతో కొట్టుమిట్టాడుతున్న రైతుల అప్పులను రద్దుచేయటానికి చేతులు రాని పాలకులు రైతుల ఆదాయాన్ని ఎలా రెట్టింపు చేస్తారు?

సాగునీరు అందించకుండా, సేద్యపు ఖర్చులు తగ్గించి పంటలకు న్యాయమైన ధరలు కల్పించకుండా, సబ్సిడీలు పెంచకుండా, మార్కెట్ సౌకర్యం కల్పించకుండా రైతుల ఆదాయం పెరగదు. ఇలాంటి విధానాలు పాలకుల అమలుపర్చరు. అందువలన రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పే ఎన్.డి.ఏ ప్రభుత్వ మాటలు బూటకమే. ఉద్యమాల ద్వారానే వాటిని రైతాంగం సాధించుకోవాలి.

oooooo